క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



రైతులతో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయాధికారి ఎం.రాజేశ్వర్

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఖర్చులు తగ్గి, దిగుబడులు పెరిగి లాభం కలుగుతుందని, భూమి సైతం సారవంతమై, మేలైన పంటల అమ్మకాలతో ప్రజల ఆరోగ్యం కాపాడినట్లవుతుందని రాష్ట్ర ప్రకృతి వ్యవసాయాధికారి ఎం.రాజేశ్వర్ అన్నారు. శనివారం ఆయన సీనియర్ కన్సల్టెంట్ భుజేశ్వరుడుతో కలిసి వెల్దుర్తి మండలం రామళ్లకోట, బోయనపల్లె గ్రామ పరిధిలో ప్రకృతి వ్యవసాయ సాగు పొలాలను పరిశీలించి పలు సూచనలిచ్చారు. విత్తనం దశ నుంచి కోత దశ వరకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంట దిగుబడులను తిరుమల తిరుపతి దేవస్థానం వారు మార్కెట్ రేటు కన్నా 10 శాతం అధిక రేటుతో కొనుగోలు చేస్తారన్నారు.

నీటి సమస్య పరిష్కరిస్తాం



పనులు పరిశీలిస్తున్న నాయకులు

మద్దికెర: స్థానిక రాంనగర్, సాయి నగర్ కాలనీల ప్రజల నీటి సమస్యను పరిష్కరిస్తామని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఓహెచ్ ట్యాంక్ నిర్మాణ పనులు పరిశీలించారు. ట్యాంక్ నిర్మాణానికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి రూ.32 లక్షలు మంజూరు చేయించారని, మరో రూ.30 లక్షలతో ఇంటింటికి నీటిని అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఆయన వెంట నాయకులు తాలూరు వెంకటేశ్వరరెడ్డి, మంజునాథ్‌రెడ్డి ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ర్యాలీలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

ఎమ్మిగనూరు టౌన్: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహబూబ్‌బాషా సూచించారు. ప్రపంచ కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా శనివారం విజయ మహిళా మండలి ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అలాగే హనుమాపురం గ్రామంలో కాలుష్య నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సుశీలమ్మ, విజయ మహిళా మండలి కోఆర్డినేటర్ దేవేంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అటెండర్ మృతి



అబ్దుల్‌సుకూర్ (ఫైల్)

దేవనకొండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయం అటెండర్ అబ్దుల్‌సుకూర్ శనివారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంకటేష్‌నాయక్, రెవెన్యూ సిబ్బంది బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. దహన సంస్కారాల నిమిత్తం రూ.25 వేలు అందజేశారు. నివాళులర్పించిన వారిలో వీఆర్వోలు ఆనంద్, జాకీర్, దాదావలి ఉన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



కొనసాగుతున్న పనులు

పత్తికొండ రూరల్: స్థానిక మడ్డిగేరి, సచివాలయాల ఎదుట రూ.10 లక్షల అంచనా వ్యయంతో సిమెంట్ రోడ్డు పనులు శనివారం ప్రారంభించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రహదారి సమస్యను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గమనించి నిధులు మంజూరు చేయించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న ఎమ్మెల్యేకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజలు జగనన్ననే కోరుకుంటున్నారు

ఆలూరు: సంక్షేమ పథకాలను అన్ని వర్గాలకు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎంపీపీ రంగమ్మ అన్నారు. ఎంపీపీ కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మండలంలో పూర్తి చేశామన్నారు. మంత్రి గుమ్మనూరు జయరాం సహకారంతో మండలంలో పలు అభివృద్ధి పనులు చేయడంతో ఏ గ్రామానికి వెళ్లినా జగనన్నే కావాలని కోరుతున్నారన్నారు.

ఆడుదాం..హాయిగా!

- ఈ నెల 15 నుంచి ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్రా'
- గ్రామ సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలు
- ఐదు క్రీడాంశాలకు సచివాలయాల్లో ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు
- నేడు రిజిస్ట్రేషన్ తుది గడువు

ప్రతిభ ఉండి..సరైన ప్రోత్సాహం లేక అనేక మంది ఇప్పటి వరకు క్రీడా వేదికల్లో పాల్గొనలేక పోయారు. వీరి పాలిట వరంగా నిలిచి..భవిష్యత్తు క్రీడాకారులుగా తయారు చేసేందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారు. రాష్ట్రంలోని 15 ఏళ్ల వయసు పైబడిన వారిలో క్రీడాసక్తిని పెంచి వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడోత్సవాలకు శ్రీకారం చుడుతున్నారు.



ఆలూరులో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు(ఫైల్)



కబడ్డీ పోటీల్లో తలబడుతున్న బాలికలు(ఫైల్)

ఆలూరు రూరల్: గ్రామీణ స్థాయి నుంచే క్రీడా కుసుమాలను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 15 ఏళ్ల వయసు పైబడిన వారిలో క్రీడాసక్తిని పెంపొందించి వారిని భవిష్యత్తు క్రీడాకారులుగా సిద్ధం చేసేందుకు ఆడుదాం ఆంధ్రా పేరుతో పోటీలను నిర్వహించనుంది. గ్రామ, వార్డు స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఐదు రకాల పోటీలను డిసెంబర్ 15 నుంచి జరిపేందుకు అధికారులు ఈ నెల 27 నుంచి నియోజకవర్గంలోని 98 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభించారు. రిజిస్ట్రేషన్లకు ఆదివారంతో గడువు ముగియనుండటంతో క్రీడలపై ఆసక్తి ఉన్న వారు త్వరపడాలని సూచిస్తున్నారు.

నిర్వహణ ఇలా..

గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ క్రీడల్లో పోటీలను నిర్వహించనున్నారు. తొలుత సచివాలయం..ఆపై మండలం అనంతరం నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు నిర్వహిస్తారు. పోటీలకు ముందే గ్రామ స్థాయి నుంచి క్రీడాకారులను గుర్తించి శిక్షణ ఇవ్వనున్నారు. బాలబాలికలకు క్రీడా పరికరాలు సైతం అందజేయనున్నారు. పోటీల నిర్వహణకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు. ప్రతి సచివాలయానికి ఒక పీడీ (ఫిజికల్ డైరెక్టర్)లను నియమించారు. పీడీలు లేని సచివాలయాలకు రిటైర్డ్ పీడీలు, పీఈటీలు, సీనియర్ క్రీడాకారులను నియమించారు. మండల స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు టీ షర్టులు, క్యాప్, రిస్ట్‌బ్యాండ్, జిల్లా స్థాయిలో విజేలతకు నగదు బహుమతి, ట్రోఫీ, మెడల్ అందజేస్తారు.

సచివాలయాల్లో ఉచితంగా రిజిస్ట్రేషన్లు

గ్రామ, వార్డు సచివాలయాల్లో 15 ఏళ్లు పైబడిన యువతీ, యువకులు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలలో రెండింటిలో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకోవచ్చు. ఇందు కోసం వారి పరిధిలోని సచివాలయంలో ఆధార్ కార్డు తీసుకుని వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గ్రామస్థాయిలో గ్రేడ్-5 సెక్రటరీ, వీఆర్వో,వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ నోడల్ అధికారిగా ఉంటారు. మండల స్థాయిలో ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, మండల విద్యాశాఖ అధికారి నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు.

క్రీడా వికాసానికి దోహదం



గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఆడుదాం ఆంధ్రా పేరుతో ప్రభుత్వం క్రీడా పోటీలను నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది. 15 ఏళ్లు పైబడిన వారు పోటీలకు అర్హులు. క్రీడలపై యువతీ, యువకులకు అవగాహన కల్పిస్తున్నాం. పోటీలు ఐదు వేర్వేరు దశల్లో జరుగుతాయి. క్రీడల్లో పాల్గొనాలనుకున్న వారు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

– ప్రకాష్ నాయుడు, పంచాయతీ విస్తరణాధికారి

ప్రణాళికబద్ధంగా నిర్వహణ



క్రీడా పోటీలు ప్రణాళికబద్ధంగా నిర్వహిస్తాం. ఇందుకు జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీ పనిచేస్తోంది. స్పోర్ట్స్ మెటీరియల్, ఫ్రైజ్‌మనీ సర్టిఫికెట్లు, ట్రోఫీలు, గ్రౌండ్ ప్రిపరేషన్, మెడికల్ కిట్లు, పీఈటీ గౌరవ వేతనం, క్రీడాకారుల టీఏ, డీఏ, రవాణా, వసతి భోజనం ఏర్పాటు చేస్తాం. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోటీలు నిర్వహిస్తాం.

– అల్లబకష్, ఎంపీడీ, ఆలూరు

పోటీల షెడ్యూల్ ఇలా..

గ్రామ స్థాయి పోటీలు డిసెంబర్ 15 నుంచి 20 వరకు, మండల స్థాయిలో డిసెంబర్ 21 నుంచి జనవరి 4వ తేదీ వరకు, నియోజకవర్గ స్థాయి పోటీలు జనవరి 5 నుంచి 10వ తేదీ వరకు, జిల్లా స్థాయి పోటీలు జనవరి 11 నుంచి 21 వరకు, రాష్ట్ర స్థాయి పోటీలు జనవరి 22 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

టమాటా మార్కెట్‌లో ఘర్షణ

- కేసు నమోదు

పత్తికొండ రూరల్: స్థానిక టమాటా మార్కెట్‌లో లారీలో సరుకు లోడింగ్ కోసం జరిగిన ఘర్షణలో గాయపడిన సర్వోత్తమనాయుడి ఫిర్యాదు మేరకు పందికోన గ్రామానికి చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మురళీమోహన్ శనివారం తెలిపారు. లారీలో సరుకు లోడింగ్ చేసుకునే విషయంలో బాలరాజు, పార్థ, వెంకటేష్, క్రిష్ణ, వీరేష్‌లు సర్వోత్తమనాయుడుపై దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

13న గొర్రెల, మేకల పెంపకం దారుల రాష్ట్ర సదస్సు

వెల్దుర్తి(కృష్ణగిరి): ఈనెల 13న నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో గొర్రెల, మేకల పెంపకందారుల రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రామాంజనేయులు తెలిపారు. శనివారం ఆయన స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి నిర్వహించే సదస్సును గొర్రెల పెంపకం దారులు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి టి కృష్ణ, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పరామర్శ

తుగ్గలి: మండల పరిధిలోని రామకొండ వైఎస్సార్‌సీపీ నాయకుడు చంద్రశేఖరరెడ్డిని శనివారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పరామర్శించారు. చంద్రశేఖరరెడ్డి ఇటీవల హైదరాబాద్‌లో బైపాస్‌సర్జరీ చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ లబ్ధి



మహిళకు బుక్‌లెట్ ఇచ్చి మాట్లాడుతున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 20వ వార్డు పరిధిలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో కలిసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన లబ్ధిని తెలిపే బుక్‌లెట్లు అందజేశారు. ఏవైనా సమస్యలుంటే చెప్పాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్, జేసీఎస్ పట్టణ కన్వీనర్ బంగి శ్రీరాం, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యుకె రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు బుట్టా రంగయ్య, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, కౌన్సిలర్లు డిష్ కేశవరెడ్డి, ఎంకె శివప్రసాద్, ఇషాక్, అమాన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కెఆర్.మురహరరెడ్డి

ఎమ్మిగనూరు రూరల్: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బంగారమ్మ సూచించారు. శనివారం మండల పరిధిలోని మల్కాపురం, కడివెళ్ల గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో ఉండాలనేది కేంద్ర ప్రభుత్వం లక్ష్యమన్నారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేఆర్ మురహరరెడ్డి మాట్లాడుతూ ఉజ్వల, ఆయుష్మాన్ భారత్, వికసిత్ భారత్ తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల ఫలాలను ప్రతిఒక్కరూ పొందాలన్నారు. గ్రామాల్లో పూర్తి మౌలిక వసతులు కల్పించటమే వికసిత్ భారత్ లక్ష్యమన్నారు. సమావేశంలో కడివెళ్ల సర్పంచ్ రంగస్వామి, నాయకులు పెద్దయ్య, ఎంఈఓ ఆంజనేయులు, ఏపీఎం శ్రీనివాసులు, ఏపీఓ విజయమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా పింఛన్ల పంపిణీ

తుగ్గలి: వైఎస్సార్ పింఛన్ కానుక రెండో రోజు వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు అందజేశారు. శనివారం సాయంత్రానికి మండలంలో 88.59 శాతం పంపిణీ పూర్తయింది.

- **నందవరం:** మండలంలో 7,149 మంది పింఛన్ దారులకు రూ.1.96 కోట్లు మంజూరైంది. శనివారం సాయంత్రానికి 87.59 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.



రామాంజనమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ జ్యోతి



పెద్దకొత్తిలిలో వికలాంగురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

పౌష్టికాహారం ద్వారానే టీబీకి అడ్డుకట్ట

ఆలూరు: పౌష్టికారహారం తీసుకుని వ్యాధి నిరోధక శక్తి పెంచుకుంటే క్షయ వ్యాధికి అడ్డుకట్ట వేయొచ్చని క్షయ వ్యాధి నివారణ అధికారి గురుప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆలూరు సీహెచ్‌సీ పరిధిలో 250 మందికి క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని రోగులు సద్వి నియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్షయ నిర్మూలన ఎడ్యుకేటర్ గోపాల్ ఉన్నారు.

ఆంజనేయుడికి కార్తీక పూజలు



హొళగుంద: మండల కేంద్రం సమీపంలో తెల్లకొండ వద్ద వెలిసిన అగ్రహార ఆంజనేయస్వామికి శనివారం కార్తీక మాసం పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామి వారం కావడంతో సమీప పొలాల రైతులు కూడా పూజల్లో పాల్గొన్నారు. స్వామి వారికి ఆకుల పూజ, కుంకుమార్చన, ఆకులార్చన, మహామంగళారతి నిర్వహించారు.

దున్నపోతు దాడిలో ఐదుగురికి గాయాలు

వెల్దుర్తి(కృష్ణగిరి): దున్నపోతు దాడిలో వెల్దుర్తి పట్టణానికి చెందిన ఐదుగురు గాయపడ్డారు. ఎస్సీ కాలనీలో పనుల్లో నిమగ్నమై ఉన్న మద్దమ్మ, లక్ష్మీదేవి, రాము, కృష్ణ, నర్సమ్మలపై దున్నపోతు దాడి చేసింది. క్షతగాత్రులను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. స్థానికులు అతికష్టం మీద దున్నపోతును అదుపులోకి తీసుకుని కట్టేయడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. కాగా దున్నపోతుకు సంబంధించిన వారు 9441296095, 9492991309 సంప్రదించి తీసుకెళ్లాలని పట్టణానికి చెందిన దేవరాజ్, పెద్దన్న కోరారు.

7 న టెంకాయలు, తలనీలాల వేలంపాటలు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో శ్రీరంగనాథస్వామి ఆలయం వద్ద టెంకాయలు, తమలపాకులు, తలనీలాలు సేకరణకు ఈనెల 7న వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ టెంకాయలు వేలంపాటకు రూ.50 వేలు, తలనీలాలకు రూ. లక్ష ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలన్నారు.

15 నుంచి పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలు

ఎమ్మిగనూరు టౌన్: ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు నెల్లూరులో పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు యూనియన్ డివిజన్ కార్యదర్శి బాలు తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ కళాశాల ఆవరణలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలకు విద్యార్థులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు విజయ్, ఉపేంద్ర, సల్మాన్, దుర్గేష్ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' విజయవంతం చేద్దాం

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆందుదాం ఆంధ్ర' క్రీడ పోటీలను విజయవంతం చేద్దామని ఎంపీడీఓ దశరథ రామయ్య అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ క్రీడల్లో ఆసక్తి ఉన్న క్రీడకారులను సచివాలయాల్లో గానీ, వలంటీర్ల వద్ద కానీ పేర్లు నమోదు చేయించుకునేలా చూడాలన్నారు.

పాఠశాలలో సామగ్రి ధ్వంసం

హొళగుంద: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు బీభత్సవం సృష్టించారు. శనివారం ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు గమనించి హెచ్ఎం నజీర్ అహమ్మద్‌కు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. కిటికీల గుండా లోపలికి చొరబడిన దుండుగులు తరగతి గదిలోని రూ.1.56 లక్షల విలువ చేసే ఐఎఫ్‌పీ డిజిటల్ టీవిని ధ్వంసం చేశారు. లేడీస్ స్టాఫ్ రూంలోని బీరువాలను పగలగొట్టి, ఫైళ్లను చిందవందర చేశారు. కుర్చీలు, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. దాదాపు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉండొచ్చని తెలుస్తోంది. విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. కాగా తాను నిద్ర పోయానని, ఇంత జరిగినా తనకు మెలకువ రాలేదని వాచ్‌మెన్ చెబుతుండటం గమనార్హం.

ఈరోజు

వాల్మీకి వనభోజన కార్యక్రమం

ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలోని వీవర్స్ కాలనీ గ్రౌండ్ గ్లోబల్ ఇండస్ స్కూల్ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేయనున్న వాల్మీకి వనభోజన కార్యక్రమానికి వాల్మీకులు హాజరుకావాలని వాల్మీకి వనభోజన సమితి సభ్యులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం ఉంటుందని విద్యాలయ ప్రిన్సిపాల్ పద్మావతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు సిద్దేశ్వరస్వామికి కార్తీక దీపోత్సవం

హొళగుంద: మండల కేంద్రంలో వెలిసిన సిద్దేశ్వర స్వామి ఆలయ ఆవరణంలో ఈ నెల 4న సోమవారం సాయంత్రం 6 గంటలకు కార్తీక దీపోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు రాజ పంపన్నగౌడ్, శివన్నగౌడ్, సిద్ధార్థగౌడ్ శనివారం తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



సీసీ రోడ్ల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

- పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలిపారు. వెల్దుర్తి మండలం చెర్లకొత్తూరు గ్రామంలో రూ.17లక్షలతో నిర్మించిన నాలుగు సీసీ రోడ్లను ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు రోడ్లు, కుళాయిల సమస్యను తనకు విన్నవించారన్నారు. సచివాలయ నిధులు మంజూరు చేయించి రోడ్లను నిర్మించి, ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేయించామన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే గోవర్ధనగిరి, చెర్లకొత్తూరు గ్రామాల కూడళ్లలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాలలో జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, వైస్ ఎంపీపీ రంగడు, సర్పంచ్ ఎల్ల రాముడు, ఎంపీడీఓ శ్రీనివాసరావ్, పీఆర్ ఏఈ సురేంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



పుచ్చకాయలమాడలో సంక్షేమ బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ నారాయణదాస్



ఎద్దులదొడ్డిలో సంక్షేమ బోర్డు ప్రదర్శిస్తున్న వైస్సార్‌సీపీ నాయకులు



ఎల్ నగరంలో బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌ఛార్జ్

పత్తికొండ రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపీపీ నారాయణదాస్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు అన్నారు. శనివారం మండల పరిధిలోని పుచ్చకాయలమాడ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి ఇంద్రాణి అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో పత్తికొండ మాజీ సర్పంచు సోమశేఖర్, పార్టీ నాయకులు మోహన్‌క్రిష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

తుగ్గలి: ప్రతి పేదవాడికి సంక్షేమాన్ని అందించేందుకు, పేద కుటుంబాల ఆర్థిక పురోభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి అన్నారు. శనివారం ఎద్దులదొడ్డిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డును ప్రదర్శించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జగన్నాథరెడ్డి, నాగేష్, మోహన్‌రెడ్డి, హనుమంతు, నాగభూషణరెడ్డి, హుసేన్, చాంద్‌బాషా, విజయభూపాల్‌రెడ్డి, రామాంజినేయులు, ఈశ్వరరెడ్డి, హరిశ్చంద్రప్ప, సుధాకర్ పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి గెలిపించుకుందాం

వెల్దుర్తి(కృష్ణగిరి): జగనన్నను మరోసారి గెలిపించుకుందామని వెల్దుర్తి మండల సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దేశాయ్ సమీర్‌కుమార్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎల్ నగరం గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసరావ్ ఆధ్వర్యంలో సంక్షేమ బోర్డు ఆవిష్కరించారు. గ్రామ కూడలిలో వైఎస్సార్సీపీ జెండా ఆవిష్కరించారు. అనంతరం నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ మహేశ్వరి, నాయకులు సురేంద్రనాథ్ రెడ్డి, చిన్నరంగడు, బడేసాహెబ్, నాగభూషి, సెక్రటరీ దేవమ్మ, వీహెచ్ఏ శేషన్న పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు

నందవరం/వెల్దుర్తి/మద్దికెర/కృష్ణగిరి/ఆలూరు రూరల్/హాలహర్వి/చిప్పగిరి: పద్దెనిమిదేళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు కావాలని మండల అధికారులు సూచించారు. శనివారం నందవరం పోలింగ్ స్టేషన్-2, 3లలో ఓటరు నమోదు క్యాంపులను తహసీల్దార్ పరిశీలించి, బూత్ లెవల్ అధికారికి పలు సూచనలు చేశారు. వెల్దుర్తి మండలం చెరుకులపాడు పోలింగ్ బూత్ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాన్ని తహసీల్దార్ శివరాముడు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌రాజు, ఆర్ఐ మస్తాన్ పరిశీలించారు. మద్దికెర మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం, ఎడవలి, బొమ్మనపల్లి గ్రామాల పోలింగ్ బూత్‌లలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ నాగభూషణం తనిఖీ చేశారు. కృష్ణగిరి మండలం పుట్లూరు, అమకతాడు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ నమోదును తహసీల్దార్ రాజేశ్వరి పరిశీలించారు. ఆలూరు ఎంపీపీ మెయిన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన 128, 129 పోలింగ్ కేంద్రాల్లోని దరఖాస్తుల స్వీకరణను అసెంబ్లీ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ రామాంజనేయులు పరిశీలించారు. తప్పుల్లేని ఓటరు జాబితాను తయారు చేయాలని సిబ్బందికి సూచించారు. హాలహర్వి మండలం అమృతాపురం, సిద్ధాపురం, బల్లూరు, బిలేహాల్, కామినహాల్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ మల్లికార్జునస్వామి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, కావాల్సిన మౌలిక సదుపాయాలు, కొత్త ఓటర్ల నమోదు వివరాలపై బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. చిప్పగిరి మండలం దౌల్తాపురం గ్రామంలో బీఎల్ఓ రంగన్న ప్రత్యేక ఓటరు నమోదు, వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు.



ఆలూరులో ఓటరు నమోదును తనిఖీ చేస్తున్న ఎన్నికల అధికారి

వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోండి

దేవనకొండ: స్వచ్ఛభారత్‌లో భాగంగా ప్రతిఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకోవాలని ఎంపీడీఓ గౌరీదేవి సూచించారు. శనివారం ఆమె మాట్లాడుతూ మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.15 వేలు అందిస్తుందని, అర్హులైన వారు గ్రామ, వార్డు సచివాలయాలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఆలూరు: వ్యక్తి గత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని హాలహర్వి మండలం టి.చాకిబండ గ్రామ సర్పంచ్ ఓబులపతి సూచించారు. గ్రామంలో శనివారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, వార్డు సభ్యులు, వలంటీర్లతో కలిసి మరుగుదొడ్లు నిర్మించుకోవాలని అవగాహన కల్పించారు.